క్లుప్తంగా

మాజీ ఎమ్మెల్యేను కలసిన టీటీడీ సభ్యుడు



మాజీ ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అశ్వర్థనాయక్

ఉరవకొండ: తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యుడిగా నియమితులైన అశ్వర్థనాయక్ ఆదివారం మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డిని అనంతపురంలోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. మాజీ ఎమ్మెల్యేను పూలమాలతో సత్కరించారు. అనంతరం అశ్వర్థనాయక్‌ను మాజీ ఎమ్మెల్యే సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా ఏకాదశి పూజలు



అలంకరణలో రుక్మిణి పాండురంగస్వామి

బొమ్మనహాళ్: మండలంలోని ఉంతకల్లు రుక్మిణి పాండురంగస్వామి ఆలయంలో ఏకాదశి పూజలు వైభవంగా నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజామున ప్రత్యేక జలంతో స్వామికి వేదమంత్రోచ్చారణ మధ్య అభిషేకం చేసి, మూలవిరాట్‌ను పట్టువస్త్రాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

కణేకల్లు: మండలంలోని మాల్యం గ్రామంలో సోమవారం ఉదయం 6గంటలకు ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆలూరు చిక్కణ్ణ, పట్టణ కన్వీనర్ టి.కేశవరెడ్డి, సర్పంచు తిప్పారెడ్డి ఆదివారం తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు హాజరు కావాలని వారు విజ్ఞప్తి చేశారు. అనంతరం 11 గంటలకు గ్రామ సచివాలయ నూతన భవనం ప్రారంభోత్సవాన్ని విప్ కాపు ప్రారంభించనున్నట్లు వారు తెలిపారు.

ప్రారంభానికి సిద్ధం



సిద్ధమైన ముఖద్వారం

కూడేరు: మండల కేంద్రంలోని అనంత వెంకటరెడ్డి కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న ముఖద్వారం ప్రారంభానికి సిద్ధమైంది. మాజీ ఎంపీ అనంత వెంకటరెడ్డి జ్ఞాపకార్థం ముఖద్వారాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు డీసీఎంఎస్ మాజీ చైర్మన్ జయచంద్రనాయుడు ఆదివారం తెలిపారు. ముఖ ద్వారాన్ని మాజీ ఎంపీ అనంతవెంకటరెడ్డి తనయుడు అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, ఎమ్మెల్సీ శివరామిరెడ్డి త్వరలో ప్రారంభిస్తారన్నారు.

యువకుడిపై దాడి

కళ్యాణదుర్గం రూరల్: తన కుమార్తెతో ఫోన్‌లో మాట్లాడుతున్నాడనే నెపంతో కుమార్తె తండ్రి అదే గ్రామానికి చెందిన యువకుడిపై దాడి చేసిన ఘటన కళ్యాణదుర్గం మండలం చాపిరి గ్రామంలో చోటు చేసుకుంది. రూరల్ పోలీసుల వివరాల మేరకు.. చాపిరి గ్రామానికి చెందిన రాజశేఖర్ అనే యువకుడు పరుశురాం అనే వ్యక్తి కుమార్తెతో రోజూ ఫోన్‌లో మాట్లాడుతున్నాడు. ఈ విషయాన్ని పరుశురాం గమనించి శనివారం రాజశేఖర్‌పై కట్టెతో దాడి చేశాడు. దాడిలో రాజశేఖర్ తలకు గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని కుటుంబ సభ్యులు కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వర్షం కోసం బొమ్మల ఊరేగింపు



వర్షం కోసం బొమ్మలకు నీళ్లు పోస్తున్న దృశ్యం

ఉరవకొండ: వర్షాలు సకాలంలో కురిసి పంటలు పండాలని కోరుతూ పట్టణంలోని 3, 4 వార్డు వాసులు, పిల్లలతో కలసి బొమ్మల ఊరేగింపు నిర్వహించారు. రోకలి బండకు పెళ్లికొడుకు, పెళ్లికూతురు ఏర్పాటు చేసుకుని ఇంటింటికి వెళ్లి బియ్యం, ఇతర వస్తువులు సేకరిస్తారు. ప్రతి ఇంటి వద్ద రోకలి బండ పట్టుకున్న పిల్లలతో పాటు బొమ్మలకు నీళ్లు పోసి వర్షం కురవాలని దేవుడిని వేడుకున్నారు. ఇలా రెండు రోజుల పాటు ఇంటింటి నుంచి సేకరించే బియ్యం ఇతర వస్తువులతో భోజనం వండి అన్నదానం చేస్తారు. వర్షాలు కురుస్తాయనే నమ్మకంతో ఇలా చేస్తామని కాలనీవాసులు తెలిపారు.

పూల సాగు..లాభాలు బాగు!

- ముద్దబంతి, చామంతి, మల్లె సాగుతో ఆర్థికాభివృద్ధి
- శ్రావణమాసం కావడంతో పూలకు డిమాండ్



వడ్డెపాళ్యం సమీపంలో సాగుచేసిన ముద్ద బంతి పూలు

కుందుర్పి: సంప్రదాయ పంటలకు స్వస్తి పలికి అన్నదాతలు వాణిజ్య పంటల వైపు మొగ్గు చూపుతున్నారు. నాలుగేళ్లుగా వర్షాలు బాగా కురిసి బోరు బావుల్లో నీరు పుష్కలంగా ఉండటంతో ఉద్యాన పంటల సాగుపై ఆసక్తి చూపుతున్నారు. కళ్యాణదుర్గం డివిజన్‌వ్యాప్తంగా రైతులు పూల తోటలు సాగు చేసి లాభాలు గడిస్తున్నారు. బోరుబావుల కింద సాగుచేసిన ముద్దబంతి, చామంతి వంటి పూలతోటలు రైతులకు మంచి లాభాలు అందిస్తున్నాయి. కుందుర్పి మండలంలో 92 ఎకరాలు, కళ్యాణదుర్గం -105 ఎకరాలు, బ్రహ్మసముద్రం - 78 ఎకరాలు, శెట్టూరు - 62 ఎకరాలు, కంబదూరు మండలంలో 67 ఎకరాల్లో ముద్దబంతి చామంతి వంటి పూలతోటలను సాగు చేసినట్లు హార్టికల్చర్ అధికారులు తెలిపారు. ప్రస్తుతం శ్రావణమాసం కావడంతో పూలకు మార్కెట్లలో మంచి గిరాకీ ఉంది. కిలో ముద్దబంతి రూ.40, కిలో చామంతి రూ.150 వరకూ, మల్లెపూలు రూ.300 ధర పలుకుతోందని రైతులు రామప్ప, మచ్చన్న, రామాంజనేయులు, మల్లేసి తదితరులు తెలిపారు. కేవలం సేంద్రియ ఎరువులను వాడి చిన్న, సన్నకారు రైతులు అర ఎకరా, ఎకరా మేర పూలతోటలతో రూ.లక్ష వరకూ దిగుబడులు సాధిస్తున్నారు. మరోవైపు కుందుర్పి మండలం కలిగొలిమి, కొలిమిపాళ్యం, జంబుగుంపల, తూముకుంట తదితర గ్రామాల్లో సిరిమల్లెలు, గుండుమల్లెలు సాగుచేసి ఆశించిన దిగుబడులు సాధిస్తూ పక్క గ్రామాల రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. కాగా ఎకరాలో చామంతి సాగుకు రూ.40 వేలు, ముద్దబంతికి రూ.15 వేలు, మల్లె పూల సాగుకు రూ.50 వేల దాకా పెట్టుబడి పెట్టాలి. మల్లెపూలు ఒకసారి సాగుచేస్తే పదేళ్ల పాటు దిగుబడి వస్తుంది.

తోట వద్దకే వ్యాపారులొస్తున్నారు



మూడు నెలలు క్రితం ఎకరాలో బిందుసేద్యం ద్వారా ముద్దబంతి సాగుచేశా. వారం రోజులుగా పూలను మార్కెట్‌కు తరలించి కిలో రూ.40తో విక్రయిస్తున్నా. శ్రావణమాసం కావడంతో తోటల వద్దకే వ్యాపారులు వచ్చి ముద్దబంతి పూలను కొనుగోలు చేస్తున్నారు.

–మల్లి, రైతు మహంతపురం

నెలకు రూ.30 వేల ఆదాయం



అర ఎకరాలో మల్లె పూలు సాగుచేశాను. కర్ణాటక లింగనపల్లి మార్కెట్‌కు తరలించి కిలో రూ.300తో విక్రయిస్తున్నా. నెలకు రూ.30వేలు ఆదాయం గడిస్తున్నా. సేంద్రియ ఎరువుల మినహా పంటకు పెద్ద ఖర్చు ఉండదు అన్నారు. అన్ని పంటల కన్నా పూలసాగు లాభదాయకం.

– ఓబన్న, రైతు కొలిమిపాళ్యం

గిరిజనుల అభ్యున్నతికి సీఎం కృషి



సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

- గడప గడపలో ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి

రాయదుర్గం: గిరిజనుల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశేష కృషి చేస్తున్నారని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం డి హీరేహాళ్ మండలంలోని సిద్ధాపురం తండాలో మార్కెట్‌యార్డ్ చైర్మన్ భోజరాజ్‌నాయక్, సర్పంచ్ రుద్రేష్, ఎంపీపీ ఎం.పవిత్ర, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాళ్ల తిమ్మారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎం.వన్నూర్‌స్వామి, ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి బీటీపీ గోవిందుతో కలసి విప్ కాపు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గిరిగూడెంలో ఇంటింటికీ వెళ్లి ఈ నాలుగేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం అందించిన లబ్ధిని వివరిస్తూ.. బుక్‌లెట్ అందజేశారు. జగనే మా నమ్మకం, జగన్‌తోనే మా భవిష్యత్తు అంటూ ఊరంతా ఏకతాటిపై కొచ్చి చాటిచెప్పారు. అనంతరం విప్ కాపు విలేకరులతో మాట్లాడారు.. గిరిజనులు అన్ని రంగాల్లోనూ రాణిస్తూ ప్రపంచంతో పోటీపడేలా తీర్చిదిద్దాలన్నదే సీఎం జగన్ లక్ష్యమన్నారు. అణగారిన వర్గాల ద్రోహి చంద్రబాబు అని విప్ విరుచుకుపడ్డారు. గిరిజనులను బాబు ఓటు బ్యాంకుగా వాడుకున్నారే తప్పా వారి అభివృద్ధిని విస్మరించాడన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. జిల్లాలోనే అత్యంత మారుమూల గ్రామం కొండల మధ్య కర్ణాటక సరిహద్దులో వెలసిన సిద్ధాపురం తండా నుంచి భోజరాజ్‌నాయక్‌కు మార్కెట్‌యార్డ్ చైర్మన్ లాంటి అత్యున్నత పదవి కట్టబెట్టిన ఘనత వైఎస్సార్‌సీపీదేనని గుర్తు చేశారు. మీ మంచికోరే జగన్‌ను కాకుండా మీ పతనాన్ని ఆశించే టీడీపీ కి పొరపాటున ఓటేస్తే ఆత్మ శోభకు గురికాక తప్పదన్నారు. రాష్ట్రంలో 4.58 లక్షల గిరిజన కుటుంబాలకు ప్రతి నెలా ఒక్కో ఇంటికీ 200ల యూనిట్ల విద్యుత్ ఉచితంగా ఇస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ మాత్రమేనన్నారు.

తండాలోకి వస్తే కాలవను నిలదీయండి

ఎన్నికలు దగ్గరపడుతున్నాయ్..? ఎప్పుడో ఐదేళ్ల క్రితం చుట్టపు చూపుగా గ్రామానికి వచ్చిన మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులకు మీతో మళ్లీ పనిపడింది..? మీ ఓటు అవసరం వచ్చింది..? తండాలోకి అడుగు పెట్టే ముందు నీ హయాంలో మా గ్రామానికి చేసిన మేలేంటి..? ఈ నాలుగేళ్లలో విప్ కాపు చేసిన అభివృద్ధి ఎలాంటిదో కళ్లప్పగించి చూశాకే ప్రవేశించాలని నిలదీయండి. ఒక్క సారి పొరపాటుపడి టీడీపీకి ఓటు వేసినందుకే రూ.వందల కోట్లు దోచేశారని, ఈ సారి ఆదేపని చేస్తే జన్మభూమి కమిటీలతో ఇళ్లుకూడా ఖాళీ చేయిస్తారేమోనని విప్ కాపు ధ్వజమెత్తారు. కార్యక్రమంలో సర్పంచులు మల్లికార్జున, శ్రీనివాసరెడ్డి, పార్టీ నాయకులు సింగాడి జగదీష్, సదీఫ్‌పాటిల్, శివానాయక్, ఉడియార్ తిప్పేస్వామి, సురేష్‌యాదవ్, వన్నూరప్ప లు పాల్గొన్నారు.

వివాహ వేడుకల్లో ప్రముఖులు



రాయదుర్గం: వధూవరులను ఆశీర్వదిస్తున్న ప్రభుత్వ విప్ కాపు దంపతులు



ఉరవకొండ: వధూవరూలను ఆశీర్వదిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ దంపతులు

రాయదుర్గం: వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రారెడ్డి కుమారుడు మహీధర్‌రెడ్డి–శైలజ వివాహం ఆదివారం పట్టణంలోని మద్దానేశ్వర కల్యాణ మందిరంలో జరిగింది. వేడుకలకు పార్టీ ప్రముఖులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ప్రభుత్వ విప్ దంపతులు కాపు రామచంద్రారెడ్డి, కాపు భారతి దగ్గరుండి కార్యక్రమాలు జరిపించారు. ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి, అనంతపురం, గుంతకల్లు ఎమ్మెల్యేలు అనంత వెంకట్రామిరెడ్డి, వై.వెంకటరామిరెడ్డి, ఉరవకొండ సమన్వయకర్త విశ్వేశ్వరరెడ్డి, ఉర్దూ అకాడమి చైర్మన్ నదీం అహ్మద్, మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, కౌన్సిలర్లు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పెద్ద సంఖ్యలో హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

ఉరవకొండ: వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ ముఖ్య నాయకుడు సీపీ వీరన్న కుమారుడు విశ్వం–గంగ వివాహ వేడుకలు ఆదివారం అనంతపురంలోని వీవీఆర్ ఫంక్షన్ హాల్‌లో వైభవంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి ఆయన సతీమణి భవనేశ్వరి, పార్టీ యువజన విభాగం చైర్మన్ వై.ప్రణయ్‌రెడ్డి, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు హాజరై వధూవరూలను ఆశీర్వదించారు.

రేపటి నుంచి గోపాలకృష్ణ ప్రతిష్ట ఉత్సవాలు

ఉరవకొండ: స్థానిక బళ్లారి బైపాస్‌లోని దేవాంగ కల్యాణ మండపం వెనుక వైపు ఉన్న రాధాకృష్ణ కల్యాణ మండపం వద్ద నూతనంగా నిర్మించిన గోపాలకృష్ణ ఆలయంలో ఈ నెల 29 నుంచి మహా గణపతి సహిత గోపాల కృష్ణ విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు ప్రారంభిస్తామని నియోజకవర్గ యాదవ సంఘం నాయకులు ఆదివారం తెలిపారు. ఈ నెల 29న గణపతి పూజ, కలశ ప్రతిష్ట, మంత్ర పుష్పం, 30న నూతన విగ్రహాల గ్రామోత్సవం, 31న నూతన విగ్రహాల ప్రాణ ప్రతిష్ట మహోత్సవం వేదపండితుల ఆధ్వర్యంలో నిర్వహిస్తామన్నారు. మాజీ మంత్రి రఘువీరారెడ్డి, ఎంపీ తలారి రంగయ్య, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, ఎమ్మెల్సీ శివరామిరెడ్డి హాజరవుతారన్నారు.

రక్షక తడులు సద్వినియోగం చేసుకోండి



అప్పిలేపల్లి వద్ద రక్షక తడులు అందిస్తున్న సిబ్బంది

కుందుర్పి: ఆర్‌డీటీ ఏఎఫ్ ఎకాలజీ డైరెక్టర్ మల్లారెడ్డి పర్యవేక్షణలో వర్షాభావంతో ఎండుతున్న పంటలకు సంస్థ ట్యాంకర్ల ద్వారా అందిస్తున్న రక్షకతడులు సద్వినియోగం చేసుకోవాలని ఎంటీఎల్ అరుణ్‌కుమార్ తెలిపారు. వారం రోజులుగా ఆర్డీటీ పర్యవేక్షణలో అప్పిలేపల్లి, బండమీదపల్లి, వడ్డెపాళ్యం, కృష్ణాపురం తదితర గ్రామాల్లో ట్యాంకర్లు, బిందు పరికరాల సాయంతో రక్షక తడులు అందిస్తున్నామన్నారు.రక్షక తడులు కావాలనుసే రైతులు ఆయా గ్రామాల సస్యమిత్ర గ్రూపు సభ్యులతో కలసి ఆర్డీటీ సిబ్బంది దృష్టికి తీసుకురావాలన్నారు.

కొత్త రేషన్ కార్డుల జారీ

- డివిజన్‌లో 2,750 కార్డులు మంజూరు
- పైసా ఖర్చులేకుండా ఇంటికే అందజేత



రాయదుర్గం: బీపీఎల్‌కు దిగువనున్న నిరుపేద కుటుంబాలకు రేషన్‌కార్డు అవసరం ఏమేరకు ఉంటుందో చెప్పనక్కర్లేదు. అర్హత కలిగిన వారందరికీ పైసా ఖర్చు లేకుండా ఇంటికే రేషన్‌కార్డు చేర్చే గొప్ప కార్యక్రమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి శ్రీకారం చుట్టారు. కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజన్‌లోని 11 మండలాల్లో తెల్లరేషన్‌కార్డులు 1,81,227, ఏఏవై (అంత్యోదయ) కార్డులు 16,838, ప్రస్తుతం కొత్తగా మంజూరైనవి 2,750. మొత్తం కలిపి 2,00815 రేషన్‌కార్డులు ఉన్నాయి. జగనన్న సురక్ష కార్యక్రమాల ద్వారా అర్హుల ఎంపిక పూర్తిచేశారు. ఈ కారణంగా కొత్తగా మంజూరైన రేషన్‌కార్డులను గ్రామ సచివాలయాల్లో ఉచితంగా అందిస్తున్నారు.

రేషన్ పంపిణీ విధానంలోనూ సంస్కరణలు

ప్రజా పంపిణీ వ్యవస్థలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. పేదల ఆరోగ్యం దృష్టిలో ఉంచుకుని న్యూట్రిషియన్ తో కూడిన సరుకులు అందించేలా ప్రణాళికలు చేపట్టారు. పోషకాలతో ఉండే నాణ్యమైన బియ్యం, గోదుమ పిండి, రాగులు ఎమ్‌డీఎమ్ వాహనాల ద్వారా ఇంటింటికీ అందించేలా కృషి చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం జాతీయ ఆహార భద్రత చట్టం (ఎన్ఎఫ్ఎస్ఏ) కార్డు దారులకు మాత్రమే రేషన్ ఇస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వం నాన్-ఎన్ఎఫ్ఎస్ఏ కార్డులకు సైతం రేషన్ సరఫరా చేస్తూ పేదలకు అండగా నిలుస్తున్నారు.

కొత్త కార్డులు పంపిణీ చేస్తున్నాం



అర్హత కలిగిన వారందరికీ కొత్తగా రేషన్‌కార్డులు మంజూరయ్యాయి. వారందరికీ సచివాలయాల్లో కార్డులు అందించే ప్రక్రియ చేపట్టాం. బీపీఎల్‌కు దిగువనున్న వారు మాత్రమే రేషన్‌కార్డు పొందాలి. ఏదో ఐటెంటీ కార్డులా ప్రభుత్వ పథకాల కోసం మాత్రమే ఉపయోగించరాదు. కార్డు రద్దవుతుందనే కారణంగా కొందరు అవసరం లేకున్నా బియ్యం తీసుకుని బయట అమ్ముకుంటున్నట్టు తెలుస్తోంది. ఇది మంచి పద్ధతికాదు. అవసరం మేరకే సరుకులు పొందాలి. కొత్తగా మంజూరైన కార్డు దారులందరికీ సరుకులు అందించే ప్రక్రియ చేపట్టాం.

– నిశాంత్‌రెడ్డి, ఆర్డీఓ, కళ్యాణదుర్గం

మొదలైన వినాయక సందడి



రాయదుర్గంటౌన్: లక్ష్మీబజార్‌లో బళ్లారికి చెందిన కళాకారులు తయారు చేసిన వినాయక ప్రతిమలు



బెళుగుప్ప: కుమ్మర వీధిలో వివిధ రూపాల్లో తయారైన వినాయక విగ్రహాలు

రాయదుర్గంటౌన్: వినాయక చవితి ఉత్సవాలకు పట్టణంలో సందడి మొదలైంది. సెప్టెంబర్ 19 నుంచి వినాయక చవితి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఇప్పటి నుంచే పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో గణనాథుల విగ్రహాలు కొనుగోలుకు రెడీగా ఉన్నాయి. పలుచోట్ల విక్రయ కేంద్రాలు ఏర్పాటయ్యాయి. స్థానికంగా బళ్లారి రోడ్డు మిట్ట వద్ద కోల్‌కత్తాకు చెందిన కళాకారులు భారీ సైజు మట్టి గణపతుల ప్రతిమలను విక్రయానికి అత్యధిక సంఖ్యలో తయారు చేస్తున్నారు. అనంతపురం రోడ్డు రైల్వే ఓవర్ బ్రిడ్జి వద్ద రాజస్థానీలు భారీ సంఖ్యలో ప్రతిమలను తయారు చేసి విక్రయానికి సిద్ధం చేశారు. అలాగే బళ్లారి జిల్లా రూపనగుడి ఇతర ప్రాంతాల నుంచి కళాకారులతోపాటు ఇతర తయారీదారులు తయారైన గణనాథుల విగ్రహాలు, ప్రతిమలు అమ్మకానికి ప్రదర్శనగా ఉంచారు. విగ్రహం సైజును బట్టి వంద రూపాయల నుంచి రూ.50 వేల దాకా ధరలు ఉన్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. విగ్రహాల కొనుగోలుకు ఉత్సవ నిర్వాహకులు అడ్వాన్సులు చెల్లిస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మట్టి వినాయక విగ్రహాల కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు.

బెళుగుప్ప: మండల కేంద్రంలోని కుమ్మర వీధిలో బొజ్జ గణపయ్యలు వివిధ ఆకృతులు, ప్రత్యేక రంగులతో ఆకట్టుకుంటున్నాయి. ప్రతి సంవత్సరం కొందరు కుమ్మరి కళాకారులు వినాయక విగ్రహాలను సొంతంగా తయారుచేయడంతో పాటు, ఆధునికతను నింపడానికి ప్రత్యేకత కలిగిన కళాకారులతో తయారు చేయించి విక్రయిస్తుంటారు. బెళుగుప్పలోని గుండ్లపల్లి ప్రధాన రస్తాలో ఏర్పాటు చేసిన ప్రత్యేక స్థావరంలో సందడి చేస్తున్న ప్రతిమల్లో కమల గణనాథుడు, సర్ప గణనాథుడు, శ్రీకృష్ణరూప, నెమలి, రాజహంస, సింహాసన వాహనాలతో పాటు గజరాజు, నంది, శంకు, మూషికం, శివస్వరూప తదతరవాటిపై రూపొందించిన ప్రతిమలు ఆకట్టుకుంటున్నాయి. వంద రూపాయల మొదలు రూ. 20,000 వరకూ పది అడుగులపైన ఉన్న ప్రతిమలను విక్రయస్తామని తయారీదారులు తెలిపారు.

ప్రధాన రహదారిపై మురుగు



రామాలయం ఎదుట రహదారిపై ప్రవహిస్తున్న మురుగు

కూడేరు: మండల కేంద్రంలోని రామాలయం, ఆంజనేయ స్వామి ఆలయం మధ్య ప్రధాన రహదారిపై మురుగు ప్రవహిస్తుండడంతో పాదచారులు, భక్తులు ఇబ్బంది పడుతున్నారు. డ్రైనేజీని శుభ్రం చేయకపోవడంతో మురుగు రోడ్డుపై చేరుతోంది. ఈ నెల 31న పౌర్ణమిని పురస్కరించుకుని రామాలయం వద్ద సామూహిక సత్యనారాయణ వ్రతం నిర్వహించనున్నారు. అధికారులు స్పందించి డ్రైనేజీని శుభ్రం చేయించి భక్తులకు, పాదచారులకు ఇబ్బందిలేకుండా చూడాలని గ్రామపెద్దలు, ప్రజలు కోరుతున్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

కంబదూరు: మండలంలోని కదిరిదేవరపల్లిలో గత కొన్ని నెలలుగా నెలకొన్న తాగునీటి సమస్య రాష్ట్ర స్త్రీ,శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్ చొరవతో పరిష్కారమైయింది. ఎంపీపీ తిమ్మరాజమ్మ, వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి గోవింద్, యువజన నాయకుడు హనుమంతరాయుడు దగ్గరుండి తాగునీటి బోరు వేయించి, మోటర్ ఏర్పాటు చేయించారు. ఆదివారం ఆయా కాలనీల్లోకి పైపు లైన్లను వేయించారు. తాగునీటి సమస్య పరిష్కారమవడంతో మంత్రికి, వైఎస్సార్‌సీపీ నాయకులకు కాలనీవాసులు ధన్యవాదాలు తెలిపారు.

అ'పూర్వ' సమ్మేళనం



బొమ్మనహాళ్: అప్పటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు



బెళుగుప్ప: పూర్వ విద్యార్థుల సమ్మేళనం

బొమ్మనహాళ్: మండలంలోని దర్గాహొన్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థులు సందడి చేశారు. 2000–2001లో పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులు కలుసుకుని అప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. నాడు విద్య నేర్పిన గురువులు బండయ్య, తిమ్మప్ప, రామస్వామి, రామక్క, వన్నారెడ్డి ,వన్నప్ప, శీనప్పను ఘనంగా సన్మానించారు. కార్య క్రమంలో ప్రధానోపాధ్యాయుడు రవిప్రసాద్, పూర్వ విద్యార్థులు గణేష్, సోమేష్, సోమనాథ్‌గౌడ్, రాతింటి వన్నూరుస్వామి, ఎర్రప్ప, చంద్ర, రమాదేవి, ఫరీదా తదితరులు పాల్గొన్నారు.

బెళుగుప్ప: మండలంలోని గంగవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2001–02లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పీఈటీ అక్కులప్ప అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో అప్పటి తెలుగు పండితుడు నారాయణరావు, హిందీ పండితురాలు సుబ్బలక్ష్మిని సన్మానించారు. అప్పటి తీపి గురుతులను నెమరువేసుకుని విద్యార్థులు సంతోషంగా గడిపారు. అనంతరం ఆర్థిక ఇబ్బందులతో ఉన్న పూర్వ విద్యార్థి రమేష్‌కు రూ.20,000 నగదు అందించారు. పూర్వ విద్యార్థులు సునీల్, లోకేష్, మహేష్, ప్రదీప్, నరసింహ, క్రిష్ణ, వన్నూరస్వామి, వినోద్, కవిత, మాలిన్‌బీ, రాధిక, పవిత్ర తదితరులు పాల్గొన్నారు.